క్లుప్తంగా

ఆలయాల ప్రారంభంలో మంత్రికి ఘనస్వాగతం



గీసుకొండ : మండలంలోని వంచనగిరిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కంఠ మహేశ్వరస్వామి, రేణుకా ఎల్లమ్మ, వన మైసమ్మ ఆలయాలను రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ముఖ్యఅతిథిగా పాల్గొని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌడ కులస్తులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షలు సాయం చేసినందుకు గాను మంత్రి సురేఖకు, మాజీ ఎమ్మెల్సీ మురళీధర్‌రావుకు గౌడ కులస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు రడం భరత్, బొమ్మగాని శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ అంబిక, గౌడ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో సిద్దేశ్వరుడు



చెన్నారావుపేట : కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా మండల కేంద్రంలోని ఆలయంలో సిద్దేశ్వరుడిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి పూజ నిర్వహించారు. అర్చకులు బీఎం.శాస్త్రీ, సాయి శాస్త్రీ, గణేశ్ శాస్త్రీ ప్రత్యేక అర్చనలు చేపట్టారు. భక్తులు సిద్దేశ్వరుడిని దర్శించి మొక్కులు చెల్లించారు.

సన్మానం



నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్త్రా అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడిగా సైప సురేశ్, ప్రధాన కార్యదర్శిగా చింతల కమలాకర్‌రెడ్డి ఎన్నిక కావడంతో వారిని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి సోమవారం శాలువాలతో సన్మానించారు. అనంతరం రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు బాదం రంజిత్, గండు నవీన్, పార్లమెంటరీ నియోజకవర్గ కోకన్వీనర్ కట్ల రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సంగెం : మండలంలోని మొండ్రాయిలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 2001–02 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. సుమారు రెండు దశాబ్దాల తర్వాత పాఠశాలను సందర్శించి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని తోటి మిత్రులతో ఆనందం పంచుకున్నారు. జీవిత అనుభవాలను ఒకరితో మరొకరు పంచుకుని సందడి చేశారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు.

నియామకం

నర్సంపేట : రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ–బొజ్జా తారకం) ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శిగా చెన్నారావుపేట మండంలోని జల్లి గ్రామంలోని మాధవరావు కాలనీకి చెందిన మంచాల వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య సోమవారం పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడారు. వెంకటేశ్వర్లు సేవలను గుర్తించి కార్యదర్శిగా నియమించినట్లు తెలిపారు.

టీయూఎఫ్ అధికార ప్రతినిధిగా...



నెక్కొండ : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నర్సంపేట డివిజన్ అధికార ప్రతినిధిగా మండల కేంద్రానికి చెందిన న్యాయవాది బొడ్డుపల్లి అజయ్‌ను నియమించినట్లు రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ సోమవారం ప్రకటనలో తెలిపారు. స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో అజయ్ కీలక పాత్ర పోషించిన క్రమంలో ఆయన సేవలను గుర్తించి నియమించినట్లు పేర్కొన్నారు.

గుడుంబా స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్

చెన్నారావుపేట : అక్రమంగా గుడుంబా తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించగా ఈర్యతండా నుంచి చెన్నారావుపేటకు, ముగ్దుంపురం నుంచి పాత ముగ్దుంపురం గ్రామాలకు నాటు సారా రవాణా చేస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను అదుపులోకి తీసుకుని నిందితుల నుంచి 12 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని ఈర్య తండాకు చెందిన ధరంసోతు వెంకన్న, ముగ్దుంపురంకు చెందిన ఇస్లావత్ భరత్‌లపై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఎస్సైలు శార్వాణి, రాజన్న, సిబ్బంది లింగేశ్వర్, వాజిద్, లింగస్వామి, స్వర్ణలత, నాగరాజు, దిలీప్, హైమద్ పాల్గొన్నారు.

జాగ్రత్తలతో పంటల్లో నష్ట నివారణ

● నర్సంపేట ఏడీఏ దామోదర్‌రెడ్డి

నెక్కొండ : సరైన జాగ్రత్తలు తీసుకుంటే పంట నష్టాన్ని నివారించొచ్చని నర్సంపేట ఏడీఏ దామోదర్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో వరి కోత మిషన్ల ఓనర్లు, డ్రైవర్లతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరి చేను పూర్తిగా పక్వానికి వచ్చాక మాత్రమే తాలు లేకుండా చూసుకుని పంట కోయాలని చెప్పారు. కోత మిషన్ ఉపయోగించే సమయంలో బ్లోయర్ ఆన్‌లో ఉంచాలని, ఆర్‌ఎంపీ 19–20 మధ్య ఉండేలా చూసుకోవాలని సూచించారు. గేర్, స్కోట్ ఏ–2 నుంచి బీ–1లో పెట్టి కోయాలని తెలిపారు. సమావేశాల్లో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎస్సై మహేందర్, మార్కెట్ కార్యదర్శి కృష్ణమీనన్, ఏఓ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదు తనిఖీ

దుగ్గొండి : ప్రత్యేక యాప్‌లో నమోదు చేసిన పంటలను మండలంలోని మందపల్లిలో ఏడీఏ దామోదర్‌రెడ్డి తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మిరప, పత్తి, మొక్కజొన్న పంటలపై చీడపీడలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు హనుమంతు, వైజయంతి, తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల్లో..

ఖానాపురం : రైతులను మోసం చేయొద్దని ఎరువులు, పురుగు మందుల వ్యాపారులకు ఏడీఏ దామోదర్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని అశోక్‌నగర్, బుధరావుపేట, మంగళవారిపేట, తదితర గ్రామాల్లోని ఫెర్టిలైజర్ షాపులను సోమవారం ఆయన తనిఖీ చేశారు. స్టాక్ బోర్డులు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులతో మాట్లాడారు. రైతులకు ఎరువులు, పురుగుల మందులు విక్రయిస్తే తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. ఇతర ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించినా, రైతులను మోసం చేసినా చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



నెక్కొండ : మాట్లాడుతున్న ఏడీఏ దామోదర్‌రెడ్డి

సీసీఐ విధానాలతో రైతులకు వెతలు



అధికారులతో మాట్లాడుతున్న శాంతికుమార్

నర్సంపేట: సీసీఐ విధానాలతో పత్తి రైతులకు వెతలు తప్పడం లేదని, ప్రభుత్వం పత్తి రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ మాజీ డైరెక్టర్ నాడెం శాంతికుమార్ డిమాండ్ చేశారు. జిన్నింగ్ మిల్లుల సమ్మెతో కొనుగోళ్లు సోమవారం నిలిచిపోవడంతో పట్టణంలోని కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. సీజన్ ప్రారంభంలో భారీ వర్షాలతో పత్తి చేలు జాలు పట్టిపోయి తెగుళ్లు, చీడపీడల బెడద ఈ సారి తీవ్రంగా ఉందన్నారు. ఫలితంగా దిగుబడి ఎకరానికి 10నుంచి 12 క్వింటాళ్లకు బదులు 5నుంచి 6క్వింటాళ్లకు పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీఐ కొత్త నిబంధనలతో కొనుగోళ్లు నిలిచిపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలని కోరారు.

ఫోజులు మాని ధరలు సమీక్షించండి

నల్లబెల్లి : కొనుగోలు కేంద్రాల వద్ద ఫోజులు మాని పంట ఉత్పతుల ధరలపై సమీక్షించాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హితవు పలికారు. మండల కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పత్తి కొనుగోలు చేయలేమని రాష్ట్ర కాటన్, మిల్లర్ల ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు చెప్పడం సిగ్గుచేటన్నారు.

అబుల్ కలామ్ ఆజాద్ స్ఫూర్తిప్రదాత



నర్సంపేట : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ సారయ్య

నర్సంపేట : మాజీ కేంద్ర విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న అవార్డు గ్రహీత మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను స్ఫూర్తిప్రదాతగా ఎంఈఓ సారయ్య అభివర్ణించారు. అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాల/కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ శ్రీపాల ఆధ్వర్యంలో మైనార్టీ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ముఖ్యఅతిథిగా హాజరై ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు కల్పనాదేవి, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి

అబుల్ కలాం ఆజాద్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు షేక్ జావిద్ కోరారు. పట్టణంలో ఆజాద్ జయంతి వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఆజాద్ జీవితాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట : నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్

వర్ధన్నపేట : మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్/కాలేజీలో అబుల్ కలాం ఆజాద్ జయంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ వస్కుల రాజు ఆధ్వర్యంలో ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ రాజు మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తోటకూరి రాజమణి, తుమ్మల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలో విద్యార్థి ప్రతిభ



నర్సంపేట రూరల్ : ఈనెల 8 నుంచి హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో నర్సంపేటలోని జెడ్పీ సెంకడరీ బాలుర పాఠశాల విద్యార్థి మహమ్మద్ ముబీన్ ప్రతిభ చాటి కాంస్య పతకాన్ని సాధించాడని ఎంఈఓ కొర్ర సారయ్య తెలిపారు. స్కూల్ ఆవరణలో ముబీన్‌ను సోమవారం ఎంఈఓ, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. ముబీన్ 55 కిలోల విభాగంలో తృతీయం స్థానంలో నిలిచి పతకం సాధించాడని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, శ్రీనివాస్, ఉమామహేశ్వర్, రవికుమార్, అబీద తబస్సుమ్, గోపాల్‌రావు, భిక్షపతి, బుచ్చిరాములు, బాల, శైలజ, ఫిజికల్ డైరెక్టర్ కోట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



నెక్కొండ : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రంజిత్‌రెడ్డి, తదితరులు

● టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి

నెక్కొండ : ప్రభుత్వం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడి తెలిపారు. మండలంలోని సూరిపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారుల చేతుల్లో మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఘంటా దామోదర్‌రెడ్డి, వ్యవసాయ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ నరేశ్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ బూర్గు విజయ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, డైరెక్టర్లు చార్ల మోహన్‌రెడ్డి, గాదె భద్రయ్య, వెంకట్‌నారాయణ, పిట్టల లక్ష్మి, రావుల మహిపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్, పాపయ్యపేట, ఎల్లాయిగూడెం, తిమ్మరాయినిపహాడ్, గొల్లభామ తండాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను అమీనాబాద్ సొసైటీ చైర్మన్ మురహరి రవి, వ్యవసాయ అధికారి గోపాల్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం సూచించిన మేరకు తేమ ఉండేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దెన రమేశ్, మాజీ జెడ్పిటీసీ బానోతు పత్తి నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీశ్, వైస్ చైర్మన్ పెండ్లి మల్లయ్య, డైరెక్టర్ మొగిలి వెంకట్‌రెడ్డి, సీఈఓ పులి రమేశ్, ఏఈఓ కిరణ్మయి, తదితరులు పాల్గొన్నారు.



చెన్నారావుపేట : కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

ప్రమాదాల నివారణకు ముళ్లపొదల తొలగింపు



గీసుకొండ : రోడ్డును చదును చేయిస్తున్న భరత్, నాయకులు

గీసుకొండ : ప్రమాదాలను నివారించేలా మండల కేంద్రంలోని 12వ వార్డు నుంచి బాలయ్యపల్లికి వెళ్లే రహదారికి ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలను కాంగ్రెస్ నాయకుడు దౌడు భరత్ డోజర్ సాయంతో సోమవారం తొలగింపజేశారు. అలాగే రహదారిని చదును చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముళ్లపొదలు పెరిగి స్కూల్ బస్సు వెళ్లడానికి ఇబ్బంది పడుతుండడంతోపాటు ప్రజలు సతమతమవుతుండడంతో తొలగింపజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ పరకాల అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, మాజీ ఎంపీపీ భీమగాని సౌజన్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జావిద్, నాయకులు మేకల యాకూబ్, వటుకుల ప్రశాంత్ రెడ్డి, గొర్రె రాజు తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట : కొమ్మలను తొలగిస్తున్న పోలీసులు

వర్ధన్నపేట : వర్ధన్నపేట నుంచి కొత్తపల్లికి వెళ్లే దారికి ఇరువైపులా అడ్డుగా పెరిగిన చెట్ల కొమ్మలను ఎస్సై చందర్, రాజు జేసీబీ సాయంతో తొలగింపజేశారు. పోలీసుల చొరవను స్థానికులు, వాహనదార్లు అభినందించారు.

విద్యుత్ ఉద్యోగుల భాగస్వామ్యంతో సేవలు



నర్సంపేట : విద్యుత్ ఉద్యోగుల భాగస్వామ్యంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్‌ఈ) మధుసూదన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం పట్టణంలోని మాతృభూమి చారిటబుల్ ట్రస్ట్ కోసం చైర్మన్ డాక్టర్ మోహన్‌రావుకు సోమవారం రూ.20 వేల చెక్కు అందజేసింది. ఈ సందర్భంగా ఎస్‌ఈ మధుసూదన్ మాట్లాడారు. సామాజిక సేవల్లో విద్యుత్ ఉద్యోగులు భాగస్వామ్యం అవుతారని తెలిపారు. ప్రతినెలా సర్కిల్‌లోని విద్యుత్ ఉద్యోగులు సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. భవిష్యత్‌లోనూ శారీరక వైకల్యం, మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారులకు సేవలు అందించాలని ఆకాంక్షించారు.

ప్రజావ్యతిరేక పాలనపై పోరాటాలు నిర్మిస్తాం

● సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రమేశ్

నర్సంపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగిస్తున్న ప్రజావ్యతిరేక పాలనపై పోరాటాలు నిర్మిస్తామని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్ తెలిపారు. పట్టణంలో వల్లకొండ స్వామి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మండల సమితి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ మతోన్మాదాన్ని ప్రేరేపిస్తోందని, ప్రజలపై భారాలు మోపుతూ కార్పొరేట్ శక్తులకు సబ్సిడీలతో లబ్ధి చేకూర్చుతోందని విమర్శించారు. డిసెంబర్ 26 వరకు ఊరూరా ఎర్ర జెండా ఎగురవేస్తూ పార్టీ పోరాట చరిత్ర భావితరాలకు తెలియజేసేలా ఏడాదిపాటు కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి బాషుమియా, పనాస ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు అక్కపెల్లి రమేశ్, గుంపెల్లి మునీశ్వర్, నాయకులు గడ్డం యాకయ్య, పాలక కవిత, ఐత యాకూబ్, గడ్డం నాగరాజు, బాదరబోయిన యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

ప్రధానోపాధ్యాయురాలి రాక.. 11 గంటలకు..

నల్లబెల్లి : మండలంలోని శనిగరం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సోమవారం ఉదయం 11 గంటలకు బడికి వచ్చింది. ఆమె తరచూ 11 గంటలకు వస్తోందని తెలుస్తోంది. స్కూల్‌లో 12 మంది విద్యార్థులు చదువుతుండగా హెచ్‌ఎంతోపాటు ఇద్దరు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఉదయం 9 గంటలకే తరగతులు ప్రారంభం కావాల్సి ఉండగా విద్యార్థులు 20 నిమిషాల ముందు పాఠశాలకు చేరుకున్నారు. 9.30 గంటల వరకు ఉపాధ్యాయులు రాకపోవడంతో విద్యార్థులు పాఠశాల ఆవరణలో నిరీక్షించారు. అనంతరం పాఠశాలలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్న ఉపాధ్యాయుడు ప్రశాంత్ చేరుకున్నారు. హెచ్‌ఎం హెచ్‌ఎం పాన్నమ్మ ఉదయం 11 గంటలకు పాఠశాలకు చేరుకుంది. ఆమె ఈనెల 7న సెలవు కోరుతు రాసిన లేఖ హాజరు రికార్డులో ఉండగా ఆ రోజు ఆమె విధులకు హాజరైనట్లు రికార్డులో సంతకం పెట్టడం గమనార్హం. ఈ విషయమై ఆమెను వివరణ కోరగా 7న సెలవు పెట్టగా, రద్దు చేసుకుని హాజరైనట్లు తెలిపారు. ఆరోగ్యం సహకరించకపోవడంతో సోమవారం ఆలస్యమైందని, ఉదయం సీఎల్ వేసుకున్నానని, సుల్తానా సెలవులో ఉన్నారని హెచ్‌ఎం చెప్పారు. మండలంలోని పాఠశాలల్లో ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని కోరుతున్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయండి

నల్లబెల్లి : బీజేపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని ఆ పార్టీ నర్సంపేట నియోజకవర్గ నాయకుడు కంభంపాటి పుల్లారావు కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన సభ్యత్వ నమోదును ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ లబ్ధి చేకూరేలా కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని నమ్మించి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిందని చెప్పారు. సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, నాయకులు వేముల రాజు, పంజాల రాము, వనపర్తి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలి

నర్సంపేట : విద్యార్థులకు బకాయి ఉన్న ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు గండు రవి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్లుగా ఉపకార వేతనాలు చెల్లించకపోవడంతో ఇంజనీరింగ్, డిగ్రీ పూర్తి చేసిన పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఉపకార వేతనాలు మంజూరు కాకపోవడంతో పలు ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వలేదని చెప్పారు. సంఘం జిల్లా ఇన్‌చార్జ్ సోల్తి సారయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలు పాలనకు దూరమవడం వల్లే అగ్రకులాలు రాష్ట్రాన్ని పాలిస్తుండడంతో ఉపకార వేతనాలు పెండింగ్‌లో ఉంటున్నాయని చెప్పారు. సమావేశంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నీలారపు నరేందర్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సోల్తి రవి, డివిజన్ ప్రధాన కార్యదర్శి సాంబరాతి మల్లేషం, ఐక్యవేదిక అధ్యక్షుడు పంజాల వెంకట్, జిల్లా నాయకులు గోపగాని వెంకన్న, మద్దెల సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలే 'ఎస్‌ఆర్‌ఆర్' ధ్యేయం

● ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ నేత శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి : మండల ప్రజలకు సామాజిక సేవలు అందించడమే ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ధ్యేయమని చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మైలారంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్మశానవాటికలో బోరు, కాంపౌండ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పెర్కవేడులో అనారోగ్యంతో బాధపడుతున్న చాంద్ బీకి రూ.5 వేలు అందజేశారు. తదనంతరం గ్రామానికి చెందిన నల్ల ఎల్లమ్మ, సుతారి యశోద ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు బియ్యంతోపాటు, నూనె అందజేశారు. అలాగే జింకురాంతండాలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సురేశ్ కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బిల్ల సుధీర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్, మండల ప్రధాన కార్యదర్శి మధు, ఉపాధ్యక్షుడు నయీమ్ పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

నేటి నుంచి గేట్ మూసివేత

సంగెం : మండలంలోని చింతలపల్లి–సంగెం 67వ రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్‌ను ట్రాక్ మరమ్మతుల నేపథ్యంలో నేటి నుంచి ఐదు రోజుల పాటు మూసివేస్తున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే సెక్షన్ ఇంజనీర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు గేట్ ద్వారా ప్రయాణించే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు ప్రత్యామ్నాయంగా 66వ నంబర్ శాయంపేట గేట్ లేదా ఎల్గూర్ రంగంపేట అండర్ రైల్వే గేట్ ద్వారా ప్రయాణించాలని సూచించారు. అధికారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

శుభ్రతతో ఆరోగ్య పరిరక్షణ

చెన్నారావుపేట : వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని డాక్టర్ సరోజ తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయ (కేజీబీవీ)లో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సరోజ మాట్లాడారు. విద్యార్థులు భోజనానికి ముందు, తర్వాత చేతుల శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యాన్ని పరిరక్షించుకునే దిశగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. తొలుత విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

అయిల్ పామ్ సాగు మేలు

నర్సంపేట రూరల్ : అయిల్ పామ్ సాగు మేలని నర్సంపేట హార్టికల్చర్ అధికారి జ్యోతి, ఆయిల్ ఇండస్ట్రీస్ ప్రతినిధి రాంచరణ్ తెలిపారు. నర్సంపేట మండలంలోని కమ్మపల్లిలోని ఆయిల్ పామ్ తోటలను సోమవారం వారు పరిశీలించారు. ఆయిల్ పామ్ పంటకు వచ్చే చీడపీడలు, యాజమాన్య పద్ధతులను వివరించారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం 90 శాతం రాయితీ కల్పిస్తోందని, డ్రిప్ ఇరిగేషన్ కూడా రాయితీపై లభిస్తుందని తెలిపారు.

యూనియన్ బ్యాంక్ ఆవిర్భావ వేడుక

సంగెం : మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ శాఖ కార్యాలయంలో సోమవారం 10వ ఆవిర్భావ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గనిపాక రాజ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బ్యాంకు సేవలను రైతులు, ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. రుణాలను సకాలంలో తిరిగి చెల్లించి బ్యాంకు అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ యాకర అనిల్, సబ్ మేనేజర్ సతీశ్, ఏపీఎం కిషన్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తాళ్లపెల్లి నర్సయ్య ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామానికి చెందిన మంద వీరలక్ష్మి, గట్ల కుమారస్వామి దరఖాస్తు చేసుకోగా ఎమ్మెల్యే మాధవరెడ్డి సహకారంతో చెక్కులు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు నన్నెబోయిన రమేశ్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల కంపుతో ఇబ్బంది

దుగ్గొండి : మండలంలోని తొగర్రాయి శివారులో గిర్నిబావి–దుగ్గొండి ప్రధాన రహదారికి సమీపంలోని అక్షర ఫౌల్ట్రీఫామ్‌లోని కోళ్ల వ్యర్థాలతో వస్తున్న కంపుతో ఇబ్బంది పడుతున్నామంటూ గ్రామస్తులు డిప్యూటీ తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీఓ అరుంధతిలకు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. దుర్వాసనతో పిల్లలు, వృద్ధులు తరచూ అనారోగ్యం పాలవుతున్నారని వాపోయారు. సమీపంలోని వ్యవసాయ క్షేత్రాల్లో పనులకు కూలీలు రావడం లేదన్నారు. విచారణ చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరారు.

వరికోతలో సూచనలు పాటించాలి

ఖానాపురం : రైతులు వరి కోతలు చేపట్టే సమయంలో సూచనలు పాటించాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్, వ్యవసాయ అధికారి బోగ శ్రీనివాస్ కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో వరికోత యాంత్రాల యజమానులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కోత సమయంలో బ్లోయర్ ఆన్ చేసి ఉంచాలని, మెషీన్‌లోని ఆర్‌పీఎం 19–20పై ఉంచడంతోపాటు కోత సమయంలో తాలు, మట్టి, గడ్డి రాకకుండా చూసుకోవాలని సూచించారు.

సర్వేకు వచ్చే అధికారులకు సహకరించాలి

పర్వతగిరి : ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ మాలోతు శంకర్‌నాయక్ కోరారు. మండలంలోని దౌలత్‌నగర్, సీకేతండాలో చేపట్టిన సర్వేను ఎంపీఓ పాక శ్రీనివాస్‌తో కలిసి ఎంపీడీఓ శంకర్ నాయక్ సోమవారం పరిశీలించారు. ఎన్యుమరేటర్లకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ పాక శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాపై చర్యలు తీసుకోవాలి

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమి (బస్టాండ్ స్థలం) కబ్జాకు గురి కావడంపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దరపు రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం తహసీల్దార్ ఫణికుమార్, పంచాయతీ కార్యదర్శి రంజిత్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేసింది.

విద్యార్థి అమరుల స్ఫూర్తితో పోరాడాలి

నర్సంపేట : విద్యార్థుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం పోరాడి ప్రాణాలర్పించిన వారి స్ఫూర్తితో పాలకుల తప్పుడు విధానాలపై పోరాడాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్ కోరారు. పట్టణంలోని ఎస్‌ఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో సందీప్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 5 నుంచి 11 వరకు విప్లవ విద్యార్థి అమరుల వర్ధంతి సభలు నిర్వహించాలని కోరారు.